# మట్టి — చాగంటి సోమయాజులు

**ఇది ఎక్కడి రైలు స్టేషను !**

నేనెరిగింది కాదు. నాలుగు ప్లాట్‌ఫారాలు వాటిపైన అడ్డంగా పేద్ద ఓవరుబ్రిడ్జి. బ్రిడ్జి ఎక్కితే సందేహం పట్టుకుంది. కుడికి వెళ్ళాలా? ఎడంకి వెళ్ళాలా? రెండుపక్కలా ఊరు విస్తరించిపోయివుంది వేలకివేలు ఇళ్లల్లో దీపాలు కనబడుతున్నాయి. బారులు బారులుగా ట్యూబులైట్లు రెండ్లపొడుగునా వెలుగుతున్నాయి. ఒకటోఫ్లోరు రెండోఫ్లోరు. మూడోఫ్లోరు ఉన్న పెద్దపెద్దమేడ లున్నాయని వాటినెత్తిమీది గదుల్లో దీపాలు చెప్పుతున్నాయి !

ఊరు పెరిగిపోయింది. ఏరిపెరిగి పోయిందేం పెరిగిపోయింది ! అసాధారణ మైన పెరకవ !

కుడి పక్కదే స్టేషను. నేను వెళ్ళవలసిన దిశ. స్టేషనుపాతది దానిలోమార్పులేదు. అది పాతకాలపు పాషాణాల కట్టడం. ఎటొచ్చి స్టేషనుముందు రెండవతరగతి పయాణికుల విశ్రాంతి భవనము సిమెంటు బెంచీలతో సరికొత్తది ఉంది. ఓ బెంచీమీద నిముషం కూర్చుందామంటే సావకాశంగా లేదు ! ముష్టివాళ్ల, బికారీలు, బీదాబిక్కీ జనులూహలంతా ఆక్రమించేశారు. బెంచీలమీద దాచుకొని పడుకున్నారు, నేల నేలంతా ఆక్రమణలో ఉంది వాళ్లచుట్టూ వాళ్ల మూటాముల్లీ కుండా ముండాతోపాటు వాళ్ల పిల్లా జెల్లా ఉన్నారు. వాళ్లుదాన్ని స్వంతంచేసుకోవడం సహజమే. ఉండడానికోచోటు ఎవరికైనా ఉండాలి కదా? రైల్వేలు ప్రజలసొత్తు. ప్రజలందరికీ చెందుతాయి. వాళ్లూ—మరచి పోకండి— ఈదేశం ప్రజలే.

రాత్రి ఎనిమిది దాటి పోతున్నాది. ఎక్కడికి వెళ్ళడం ? నిలబడి ఆలోచిస్తున్నాను. అసలెందుకొచ్చానీవూరు ? పిచ్చిపనిచేసినట్టే ఉంది. తప్పుతప్పు ఇది నాతాత ముత్తాతలఊరు, పుట్టిపెరిగిన ఊరు, చదివి ఉద్యోగం దొరక్క రోడ్లతిరిగిన ఊరు ఈమట్టి మీద మమకారంతో వచ్చాను పన్నెండేళ్ళయిపోయింది. ఊరు వదిలి ! చూడాలని పిచ్చెత్తివచ్చాను.


దగ్గరాదాపలా ? రెండు రాత్రిళ్ళు రెండు పగళ్ళు రైల్లోపడి ప్రయాణిస్తే మూడో రోజు రాత్రి ఎనిమిది గంటలకు దిగాను. దేశానికి పశ్చిమోత్తరం నుంచి తూర్పు సముద్ర తీరానికి రావడం అయింది.

దేశం ఆమూలనుంచి రాష్ట్రం తరవాత రాష్ట్రం దాటుతూ ఓహోహో ఏమి నాదేశం! ఏహోహో ఏమి నా దేశం ! ఆహా వచ్చేసింది నారాష్ట్రం. దగ్గరపడ్డాది మావూరు. వచ్చేస్తున్నాది మావూరు, వచ్చేస్తున్నాది మావూరు అనుకొంటూ ప్రయాణం చేశాను.

ఊరు ముందు రైలు దిగి నిలబడ్డా. ఎక్కడికి వెళ్ళడం ? ఇల్లు లేదు. వాకిలి లేదు. నా అన్న వాళ్ళులేరు. అద్దెకొంపలో పుట్టేను అద్దెకొంపలో పెరిగేను. ఇంకా అద్దెకొంపలో పెద్దవాణ్ణయాను. ఊరు విడిచివెళ్ళి పన్నెండేళ్ళు దాటి ఆరునెల ఏడురోజులైంది. నేను ఊరు విడిచిపెట్టడం బాగా జ్ఞాపకం. ఎలాగ మరచిపోవడం దూరపు బంధువు మాట నమ్మి అతనితో అతి దూరపు రాష్ట్రం వెళ్ళిపోయాను.

"అంతా ఒక్కటేదేశంరా. అక్కడివి ఇక్కడి మట్టీ కలిసే ఉన్నాయి. రా అక్కడికి బతుకుదువుగాని. అక్కడ అరణ్యంలో ప్రాజెక్టులు కడుతున్నారు పరిశ్రమలు నెలకొల్పుతున్నారు. అక్కడ మనుషులు కావాలి, ఎవడూరావడంలేదు తెగించి నేను వెళ్ళాను తెగించి నువ్వూ బతుకుదువుగాని చదువుకున్న వాడివి రా బతుకుదువుగాని" అన్నాడాదూరపుబంధువు.

అమ్మకీ నాన్నకీ ఇష్టంలేదు. నేను మాత్రం భల్లూకపు పట్టు పట్టేశాను, ఆఖరికి 'మా అమ్మే వెళ్ళు నాయనా' అంది. నాకు అవసరమైన డబ్బు యిచ్చింది. వెయ్యి జాగ్రత్తలు చెప్పి, వెయ్యి దీవనలు దీవించి



వెయ్యి దేముళ్ళకి మొక్కి నన్ను పంపింది. ఎలాగ పంపించి అమ్మ? పల్లిగవ్వ లేని సమయంలో మా నాన్న ఆర్జన పూట తిండికి సరిపడని స్థితిలో ఎలా పంపింది. అమ్మ? అప్పుడు తెలియదు. సంతోషంగా వెళ్ళాను. అమ్మ పుస్తెలు తాకట్టు పెట్టి కాదు నన్ను పంపింది! అమ్మ పుస్తెలు అమ్మేసి నన్ను పంపింది!

నన్ను బాగుచేసిన కీర్తి అమ్మదే! నన్ను బాగుచేసిన కీర్తి ఆ దూరపు బంధువుదే! ఆ కీర్తికి తాను అందుకొనే ఆ బంధువు ఈ మధ్యనే కీర్తిశేషుడయాడు.

అలాగా పోయాను కాబట్టే ఇంట్లో నలుగురూ ఐదు వేళ్ళతో అన్నం తినగలిగారు. నాకన్నా నాలుగేళ్ళు పెద్దదైన అక్కకి పెళ్ళి చేసి పోయింటిదాన్ని చెయ్యగలిగాము. నేను మాత్రం ఆ పెళ్ళికి వెళ్ళలేదు! ఏం వెళతాను? అబ్బో! దబ్బో! నా తమ్ముడు పట్టభద్రుడై రైల్వే సర్వీసు కమిషను పరీక్ష గట్టెక్కి రైలు కమ్ములమీంచి అతి దూరంగా పోయాడు! బతుకుతున్నాడు అదే పదివేలు

ఆనాడు ఆ దూరపు బంధువుతో వెళ్ళడమే వెళ్ళడము. మళ్ళా ఊరి మొహం చూడలేదు!

"ఒక్కసారి వచ్చి కనపడరాబాబూ. నిన్ను చూడాలని కళ్ళు కాయలు కాసి పోతున్నాయిరా" అని ఏడుస్తు ఏళ్ళ తరబడి అమ్మ ఉత్తరాలు రాస్తూనే వొచ్చింది. పుట్టిన వూరు వెళ్ళాలంటే రెండు నెలల జీతం ఖర్చుపెట్టాలి. బాధ్యతలే!

మా నాన్న షష్టిపూర్తి అమ్మనీ నాన్ననీ సంసారం పూర్తిగా ఎత్తేసి నా దగ్గరకు వచ్చెయ్యమని కోరేను కోరడమేమిటి? తాఖీదు పంపాను. పోషించే కొడుకు దగ్గర కాక ముసిలికాలంలో ఎక్కడుంటారు తల్లీ తండ్రీ?

వాళ్ళ నమ్మకాలు వాళ్ళవి. తదియనాడు బయలుదేరి పంచమి నాటికి వచ్చేరు. రైలు దిగి నన్ను పట్టుకొని అమ్మ ఒకటే ఏడుపు? నన్ను కౌగలించుకొని రిక్షాలో కూర్చుని ఒకటే ఏడుపు!

"ఇదే మన క్వార్టరు" అని అమ్మని చెయ్యి పట్టుకుని కిందికి దించాను.

"నిజంగా?" అని అమ్మ నిర్ఘాంత పోయింది. మా వూళ్ళో మా అమ్మా నాన్నా బతికిన అద్దె కొంపలెక్కడ ఆధునికంగా కట్టిన నా క్వార్టరెక్కడ? అందమైన క్వార్టరు చుట్టూ ముచ్చటగా మొక్కలువేసి మరీ అందంగా తయారుచేశాను.

అమ్మనీ నాన్ననీ దిగ్భ్రమ కలిగించింది మరోటుంది. నేనొంటరి వాణ్ణి కాదు. ఇల్లు ఇల్లాలితో ఉంది ఆ దేశపు పిల్ల. దాందే కులమో నాదేకులమో. నాది దక్షిణాది. దాంది పశ్చిమోత్తరాది. నాతోపాటు ఉద్యోగస్తురాలు. దాని చేయూత లేకపోతే మా వూళ్ళో మా యిల్లు గట్టెక్కేదా?

అమ్మా నాన్న ఏం గుసగుసలాడుకొన్నారో ఏం గుంజాటనలు పడ్డారో అదంతా వేరే కథ. ఇప్పుడా? మా అమ్మ కోడలిని నెత్తిమీద పెట్టుకొంటున్నాది.

మా అమ్మా నాన్నా వచ్చేక నాకు పిచ్చెక్కిపోయింది. ఒక సారి మా వూరెళ్ళి చూడాలని. చూడ్డానికేముంది? తిరిగిన వీధులున్నాయి. ఊరవతల ప్రదేశాలున్నాయి. అమ్మా నాన్న నా దగ్గరే ఉన్నా పుట్టి పెరిగిన మట్టిమీద మమకారం నన్ను ఉన్మాదిణ్ణి చేసింది. అందికే అంత దూరం ప్రయాణం చేసి వచ్చాను. ఎవ్వరూ లేక పోయినా కేవలం వూరు చూడ్డానికి వచ్చానంటే ఎవరైనా నవ్వవొచ్చు. ఊళ్ళో ఉన్న వాళ్ళకి ఏం తెలుస్తుంది? ఊరు వొదిలి వెళ్ళిన వాళ్ళకి తెలుస్తుంది. పుట్టిన మట్టి మీద ప్రేమ ఏమిటో! కాని రాత్రి తల దాచుకోడానికి చోటు లేదు.

నాలుగడుగులు వేస్తే రెండు సినీమా హాల్సు ప్రత్యక్షమయాయి. మరి నాలుగు వూళ్ళో వెలసినట్టు పోస్టర్లు చెప్పేయి. లాడ్జింగు హౌసుబోర్డు కనబడ్డాది. దానికెదురుగా మరొకటి కనబడ్డాది. ఇంకనేం? మనం ఏవూరు వెళ్ళినా లాడ్జింగు హౌసుగదేదిక్కు.

మర్నాటి ఉదయాన్నే వీధుల్లో పడ్డాను. ఆ వీధి నేనెరుగుదును ఆ యిల్లు ఎరుగుదును. అందులో నేనేగదిలో పుట్టేనో ఎరుగుదును. అది రోడ్డు మీదికే కనబడుతుంది, ఆ వీధిలో నేను పుట్టిన యిల్లు లేదు! దాని మీద పెద్ద సిమెంటు భవనం ఉంది. ఇత్తడి ప్లేటు ఇల్లేవరిదో చెప్పుతున్నది. బీదలు ఇళ్ళు అమ్ముకు పోతారు. ధనికులు మేడలు కడతారు!

ఏ వీధిలోంచి వెళ్ళినా కనబడుతున్న మొహాలన్నీ తెలియని మొహాలే! పలకరించినవాడుకాదు. పొల్లి ఎరిగిన మొహం కనబడలేదు! అంతట్లో-

"ఒరేయ్! ఒరేయ్! ఓరేయ్!" అని బొబ్బలు పెడుతూ, నా పేరు పెట్టి పిలుస్తు రోడ్డుకి అడ్డదిడ్డంగా పరిగెడుతూ ఒకడు నా దగ్గరకు దూసుకువచ్చాడు!

వాడి మొహం పొల్లి పట్టేన. హైస్కూల్లో మాతో మూడేళ్ల చదివి చదువు చాలించుకొన్నవాడు. వాడు చెప్పే వూరు భోగట్టాలు. నేను పూజ్య భావం చూసుకొనే మేష్టర్లు ఒక్కరూ బతికిలేరు. తరం మనుషులంతా మట్టిలో కలిసిపోయారు. వాడు పెద్దపెద్ద వాళ్ళ భోగట్టాలు చెప్పేడు. పెద్ద ప్లీడరుగారి పెద్ద కొడుకు-నూ క్లాసు మేటు-వాడూ వాడి పెళ్ళాం అమెరికాలో ఉన్నారుట. ఆ దగ్గరెక్కడో కొత్తగా కట్టి "ఏ.సి." సినీమాహాలు ప్రొప్రయిటరు నా క్లాసుమేటే. ఇలాగ్గా ఊళ్ళో ఐశ్వర్యవంతుల భోగట్టాలు చాలా చెప్పుకొచ్చాడు. ఊరందరికీ డబ్బున్న వాళ్ళ భోగట్టాలే తెలుస్తాయి. వాడికి అవే తెలుసు. అవే చెప్పేడు. నేను ముందుకు అడుగు వేస్తున్నాను.

"ఒరే బ్రదర్ ఒరే బ్రదర్" అంటూ వెంబడించాడు. చుట్టుకుచుట్టుకు పోతూ ఐదు రూపాయలు అడుక్కున్నాడు. కుళ్ళు గుడ్డల్లో ఉన్న ఆ కంపు వెధవ భుజంమీద చెయ్యివేసి దగ్గరకు లాక్కొని ఐదు రూపాయిలూ తీసి యిచ్చాను.

"ఇవ్వననుకొన్నాను ఇచ్చావురా! ఇచ్చావురా! ఐదురూపాయలడిగితే అర్ధ రూపాయైనా ఇవ్వవా అనుకొన్నాను. అడిగినంత ఇచ్చావురా!" అని అలసిపోయిన వాడిలా "అహ్హ ఆహ్హ" అని శ్వాస తీసుకొని ఇంకేదో అనబోయి ఆగిపోయాడు. "కృతజ్ఞత" రూపందాల్చి వాడి మొహమంత నిండి కనబడ్డాది. వాణ్ణి పంపి నేను ముందుకు నడిచాను. వాడు వెనక్కి వెనక్కి పోయాడు. బతుకులో ఇంకావెనక్కి వెనక్కి పోతాడు తప్పదు. నన్ను "ఒరేయ్" అని పిలిచిన ఒకేఒక్క నా చిన్ననాటి చెలికాడు.

వాడు నాకు బ్రదరే! దేశంలో అందరూ అన్నదమ్ములమే! అఖిల భారతీయులం! ఊళ్ళో ఇంకేం చూడబుద్ధి పుట్టలేదు.

అందికే మధ్యాహ్నం వూరవతలకెళ్ళాను. మంచి ఎండవేళ. వూరు చివర సూ... గూడెం లాగే ఉంది. గుడిసెలవాళ్ళు గుడి

ల్లోనే బతుకుతున్నారు. గుడిసెల ముందు టీ కొట్లు ఉన్నాయి. చేపల పోగులు, కూరల పోగులు రోడ్డుమీద అమ్మకానికున్నాయి.

టీ కొట్టుకెళ్లి గళాసు కాస్త కడిగి టీ ఇమ్మన్నాను.

"కడాక్ టీ" అన్నాడు కొట్టువాడు.

"కడాక్ టీ" అన్నాను ఎంతో వినయంతో కడాక్ టీ కలిపి అందిచ్చాడు. ప్రాణం లేచి వచ్చింది. టీ పసందుగా ఉంది.

టీ తాగి ఆరోడ్డు ఎక్కుదును గుండె గుభేలుమంది! అంతా బంగళాయలు. ఎండలో బొగులు బొగులు మంటున్నాది. అరవైడెబ్భై ఎకరాల మాతాత ముత్తాతల నాటి మామిడితోట అక్కడ ఉండేది లేదు! మనది కాదు ఆతోట. నిజమే దాని అందం? చూచే నాకళ్ళది, ఆస్థలం నిండా హద్దులు హద్దులుగా ఇళ్ళ స్థలానికి విభజించి పాతిన రాళ్ళు ఉన్నాయి. పట్నాల్లో ఇళ్ళ స్థలాలు పెద్దపెద్ద కుంభకోణాలు. అదీ గోపెద్ద కుంభకోణం అయివుండవొచ్చు!

నా సంతోషానికి అవధులు లేవు. ఆనందభాష్పాలతో నాకళ్ళునిండిపోయాయి. పరుగులాటి నడకతో ముందుకు నడిచాను. ఎదురుగా కొన్ని వందల ఎకరాల మావూరి పెద్ద చెరువు ఉంది. ఆకాశం చివరిదాకా కొన్ని వేల ఎకరాల వరిచేలు ఆకాశం చివర్లకి పరిగెడుతున్నాది.

ఆ మహా తటాకం గట్టుమీద నిలబడి "ఓ చెరువా నాకు మాత్రం నువ్వు ఈ ఊళ్లో పట్టెడన్నం పెట్టలేకపోయావు" అని చెప్పేను చెరువుకి చెప్పి ప్రయోజనంలేదని తెలుసు, చెరువుతో చెప్పేను దాని అలువ వార అంతరిక్షాన్ని అంటుకొని, అంతరిక్షమంతా నిండిపోయి పెను మర్రిచెట్టు ఉంది, పందిలాడి ఊడలతో సువిశాలమైన భూమిని ఆక్రమించి విస్తరించిఉంది. ఆ మర్రిని చూడానికే నేను వెళ్ళింది. నయమే దానిజోలికి గొడ్డలి వెళ్ళలేదు!

అది పక్షుల మహానగరం రాత్రంతా వేలకివేలు పక్షులు అందులో విశ్రమిస్తాయి. పగలల్లా వేలకివేలు గబ్బిలాలు అందులో తలకిందులుగా వేళ్ళాడి నిద్రపోతాయి చీకటి పడేవేళ మర్రిఆకులన్నీ అరుస్తున్నాయా అనిపిస్తుంది వేలకివేల పక్షులకూజితాలతో మర్రి నిండిపోతుంది.

అక్కడ గుట్టమీదికెక్కి "నక్కేరు" చెట్టు నీడలో కూర్చున్నాను, అక్కడికి వూరువూరంతా కనబడుతున్నాది, బడుగు వర్గాల వారికి ప్రత్యేకంగా కట్టియిచ్చిన "గృహకల్ప" కనబడ్డాది. ఆ గృహకల్ప "గూళ్ళు" చిన్నపిల్లలు పేర్చుకొన్న అగ్గిపెట్టెల్లా కనబడ్డాయి అంబర చుంబిత హర్మ్యాలతో, సువిశాలమైన వీధులతో, పెరటి తోటలతో "అగ్రవర్గాల" వారి గృహకల్ప కనబడ్డాది.

ప్రక్క-ప్రక్కనే!

"నక్కేరు" పండుతీసి బుగ్గని పెడితే రుచిగల దానిబంక నోరల్లాపట్టుకొని నా చిన్ననాటి జ్ఞాపకాలను తెచ్చుకొడుతున్నాది. నేను పుట్టిపెరిగిన వూరు ఎదురుగాఉంది, నేను బతుకుతున్న ఊరు మనో అవనిక మీద కనబడుతున్నాది. అక్కడ మట్టీ ఇక్కడమట్టీ కలిసి ఒకేమట్టి ఒకేదేశమని ఆనాడు మాదూరపు బంధువు చెప్పేడు.

నిజమే ఒకే మట్టి. భూమే ఒకపెద్ద మట్టి ఉండ. ఆమట్టిలో రేణువులే చైతన్యవంతమై నేనైనాను. ఆమట్టిలో రేణువులే పెనుమర్రిగాలేచాయి, మట్టిమీద మమకారంతో వచ్చాను. ఆమట్టేనేను, నేనేఆమట్టి!

